నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజామాబాద్ డివిజన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడు తుందని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. అజామాబాద్ డివిజన్ పరిధిలోని అచ్యుత్‌రెడ్డి మార్గ్, సీపీఎం ఆఫీస్, రాంనగర్ గుండు, విద్యానగర్ పోస్ట్ ఆఫీస్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11.30 వరకు... రాంనగర్ ఫీడర్ పరిధిలోని టీఆర్‌టీ క్వార్టర్స్, రెడ్డి ఆయిల్‌మిల్, రెడ్డి ఆఫీస్, సోప్ ఫ్యాక్టరీ, ఆర్‌టీసీ కల్యాణ మండపం, అచ్చయ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... ప్రీవెంట్యూ మెడిసిన్ ఫీడర్ పరిధిలోని హెచ్‌ఆర్ డీగ్రీ కాలేజ్, రత్నా డీగ్రీ కాలేజ్, రెడ్డి కాలేజ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3గంటల వరకు... బతుకమ్మ పుట్ట, ఆప్కో ఫీడర్ల పరిధిలోని పాముల బస్తీ, మల్లన్న టెంపుల్, గంగానగర్, పోచమ్మ బస్తీ, మెల్కొటే పార్కు, శాంతి థియేటర్, ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్, తెలంగాణ టూరిజం కార్యాలయం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30గంటల నుంచి 4.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మావో చూపిన మార్గమే ప్రజలకు విముక్తి బాట

ముషీరాబాద్: జన చైతన్య నిర్మాత, కార్మికవర్గ సిద్ధాంతవేత్త 'మావో'చూపిన మార్గమే దేశ ప్రజల విముక్తికి సరైన బాట అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్ అన్నారు. మావో 49వ వర్ధంతిని మంగళవారం మార్క్స్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో ఆయన 'మావో'కు విప్లవ జోహార్లు అర్పించారు. పార్టీ కార్యదర్శి జి.ఝాన్సీ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అరుణ, పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు మహేష్, నగర నాయకులు ఆసిఫ్, వంశీ, పీవోడబ్ల్యూ నాయకురాలు మణిమాల, ఆఫీస్ కార్యదర్శి మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతో మాల, మాల ఉపకులాలకు తీవ్ర నష్టం

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణ ద్వారా అమల వుతున్న జీఓ నం.99తో గ్రూప్–3లో చేర్చిన 26 మాల, మాల ఉపకులాలకు విద్యా, ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని మాల సంఘాల జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రత్యేక దృష్టి సారించి తమ సమస్యను పరిష్కరించాలని మంగళవారం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణరావుకు వారు వినతి పత్రం అందజేశారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన ఇంజినీరింగ్, డెంటల్, ఎల్ఎల్‌బీ, పీహెచ్‌డీ తదితర అడ్మిషన్‌లో మాల, మాల అనుబంధ కులాలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. గ్రూప్–3లో చేర్చిన 26 మాల, మాల ఉపకులాలకు రోస్టర్ పాయింట్‌ను 20కి మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ఈ అంశంపై ప్రభుత్వం మాల సామాజికవర్గానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్, యువజన జేఏసీ అధ్యక్షుడు డా. వీరస్వామి, ఓయూ అధ్యక్షుడు సైదులు, ఉద్యోగ సంఘాల జేఏసీ కోఆర్డినేటర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి

చిక్కడపల్లి: కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి రగిలించారని నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ అన్నారు. చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో మంగళవారం కవి కాళోజీ నారాయణరావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పొట్లూరి పద్మజ మాట్లాడుతూ.. నారాయణరావు రాసిన సాహిత్యం పరిమితమే అయినా ప్రజల్లో అపరిమిత పోరాట స్ఫూర్తిని రగిలించారని అన్నారు. ప్రాంతాలకు అతీతంగా తెలుగువారి ఖ్యాతిని నిలిపిన మహనీయులతో పాటు దేశ మహోన్నతులను ఈ తరానికి గుర్తు చేస్తూ కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు ఎల్.చంద్రకళ, బి.ప్రతిభారెడ్డి, ఎం.వెంకటేష్‌యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దిశ సభ్యుడిగా కె.రవిచారి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి నియమితులయ్యారు. జిల్లా స్థాయిలో కేంద్ర పథకాల పర్యవేక్షణ కోసం ఈ కమిటీని 2016లో ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా జిల్లా లోక్‌సభ సభ్యులు, సహా అధ్యక్షులుగా జిల్లా కలెక్టర్, సభ్యులుగా రాజ్యసభ సభ్యులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉంటారు. ప్రతి మూడునెలలకోసారి కమిటీ సమావేశం జరుగుతుందని రవిచారి తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అధ్వానంగా రహదారులు

అడ్డగుట్టలో దెబ్బతిన్న రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు



అడ్డగుట్ట సీ సెక్షన్, తుకారాంగేట్ ఆర్‌యూబీ వద్ద దెబ్బతిన్న రోడ్లు



గుంతలమయంగా మారిన రోడ్లతో నిలిచిన మురుగు

అడ్డగుట్ట: ఇటీవల కురిసిన వర్షాల దాటికి అడ్డగుట్టలో రోడ్లు అధ్వానంగా మారాయి. వాటికి మరమ్మతులు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నామంటూ వాపోతున్నారు. అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రధాన రోడ్డు మార్గాలతో పాటు బీ, సీ సెక్షన్లలో రోడ్లన్నీ గుంతలమయంగా దర్శనమిస్తున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు సందర్భాల్లో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత జీహెచ్‌ఎంసీ సిబ్బంది దెబ్బతిన్న రోడ్లకు తగిన మరమ్మతులు చేయడం లేదు.

మరిచిన ప్యాచ్ వర్క్ పనులు

ప్రధాన రోడ్డు మార్గం రోడ్లన్నీ దెబ్బతిన్నప్పటికీ వాటికి ప్యాచ్ వర్క్‌పనులు చేయడంతో అధికారులు చూపుతున్న అలసత్వానికి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతల మయంగా మారిన రోడ్లలో వర్షపు నీరు, మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతుందని ,అంతే కాకుండా అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లపై నుంచి వాహనాలు వెళ్తున్న సమయాల్లో ఆ నీళ్లు దుకాణాల్లో పడుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

పేరుకుపోతున్నా పట్టించుకోరా?

తుకారాంగేట్‌లోని కొండారెడ్డి పార్కు పక్కనే దాదాపు పది రోజుల క్రితం చెట్ల కొమ్మలను వేసిన సిబ్బంది వాటిని ఇప్పటికీ తొలగించలేరు. దీంతో కురుస్తున్న వర్షాలకు పేరుకుపోయిన చెట్ల కొమ్మల నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. పార్కు గేటు పక్కనే వీటిని వేయడంతో దుర్భరమైన దుర్గంధంతో ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందని పార్కుకు వచ్చే వాళ్లు వాపోతున్నారు.

ఎవ్వరూ పట్టించుకోవడం లేదు



కొన్ని నెలలుగా సీ సెక్షన్‌లో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. ఈ దారిలో పోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇక రాత్రి సమయాల్లో ఈ దారిగుండా అసలు నడవలేకపోతున్నాం. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. బస్తీల్లో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలి.

– లక్ష్మమ్మ, సీ సెక్షన్, అడ్డగుట్ట

కార్పొరేటర్ ధర్నా చేస్తారని..

హడావిడిగా అర్ధరాత్రి పనులు మొదలెట్టిన కాంట్రాక్టర్



అర్ధరాత్రి నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న గోల్నాక కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై గోల్నాక కార్పొరేటర్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్‌లో శంకర్ నగర్‌తో వివిధ ప్రాంతాల్లో శంకుస్థాపన చేసినా రోడ్లు వేయడంలో జాప్యం జరుగుతోందని స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ పలుమార్లు అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారు స్పందించకపోవడంతో సోమవారం రాత్రి కార్పొరేటర్ ధర్నా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ హడావిడిగా రోడ్డు పనులను ప్రారంభించారు. దీంతో అర్ధరాత్రి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ పర్యవేక్షించారు. నాణ్యత ప్రమాణాలతో రోడ్డును నిర్మించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి



అరవిందకుమార్ యదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం మేడే దేవదాస్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ కవేలి గ్రౌండ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని హెచ్‌ఎం మేడే దేవదాస్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్‌ను కలసి ఆయన వినతి పత్రం సమర్పించారు. పాఠశాలలో పవర్‌బోర్‌ను రీబోర్ చేయించాలని.. పాఠశాల పై అంతస్తులో రెండు తరగతి గదులు ఏర్పాటు చేయించి నాలుగు కంప్యూటర్లు ఇవ్వాలని కోరారు. అదే విధంగా పాఠశాలకు వచ్చే దారిలో సీసీ రోడ్డును నిర్మించాలన్నారు. ఈ సందర్భంగా అరవిందకుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. తన సోదరుడు ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్తున్నారు. అవసరమైతే విద్యాశాఖ అధికారులతో కూడా మాట్లాడి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రంశంకర్, సీనియర్ నేత గుర్రం చంద్రకళ, యాదగిరిగౌడ్, శీలం సత్యనారాయణ, గుండు జగదీశ్‌బాబు, అభిషేక్ కెన్నడీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే



మైనార్టీ గురుకుల పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యే వెంకటేశ్

అంబర్‌పేట: సమాజంలో ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేటలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఆయన సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని అన్ని రంగాల్లో రాణించేలా చొరవ తీసుకోవాలన్నారు. చిన్ననాటి గురువుల జ్ఞాపకాలు ప్రతి విద్యార్థికి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించలేరు



లంబాడీ తండాలో జరిగిన సేవాలాల్ సేన జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సంజీవ్‌నాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: లంబాడీల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వైఖరిని స్పష్టం చేయాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ అన్నారు. లంబాడీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాలో సేవాలాల్ సేన 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించడం ఎవరి తరం కాదని అన్నారు. అది రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు. 'మా తండాలో మా రాజ్యాన్ని'నిర్మించుకుంటామని అన్నారు. సేవాలాల్ సేన దీర్ఘకాలిక పోరాటాల వల్లే తమ హక్కులను సాధించుకున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ఒక గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దారని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం గిరిజనులకు రిజర్వేషన్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. జీవో నం.33 ద్వారా 10 శాతం రిజర్వేషన్ సాధించుకున్నామని చెప్పారు. సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోతు హుస్సేన్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్, ఉపాధ్యక్షుడు సోములనాయక్, విద్యార్థి సేన అధ్యక్షుడు రాజు రాథోడ్, అధికార ప్రతినిధి లాలు నాయక్, ఉద్యోగ సేన ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

అంబర్‌పేట: కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయిలో మహిళలకు అవకాశం కల్పిస్తోందని ఖైరతాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు శంభుల ఉషా శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేటలో జరిగిన పార్టీ బూత్‌స్థాయి సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మహిళ నాయకులకు వివిధ కమిటీ బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రాలను అందజేశారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.



నియామక పత్రాలు అందుకున్న వారితో ఉషాశ్రీ

రాష్ట్ర బీజేపీ కార్యదర్శిగా బండారు విజయలక్ష్మి



ముషీరాబాద్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బండారు విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తానని ఆమె తెలిపారు.

రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యం



పార్టీ ప్రధాన కార్యదర్శి డా. ఎన్.గౌతంరావుకు అభినందనలు తెలుపుతున్న కార్పొరేటర్ ఉమా

కాచిగూడ: తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా అందరిని కలుపుకుని పోతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పార్టీ ప్రధాన కార్యదర్శి డా. ఎన్.గౌతంరావు అన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమితులైన సందర్భంగా మంగళవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దంపతులు ఆయనను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేసేందుకు కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎడెల్లి అజయ్‌కుమార్, కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిగా డా. సంజూసుధా

ముషీరాబాద్: భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యాధికారిగా డాక్టర్ బి.సంజూసుధా మంగళవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానన్నారు. మురికివాడ ప్రాంతాలలో శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

రెండు రోజుల్లో కమ్యూనిటీహాల్ పునరుద్ధరణ పనులు

చిక్కడపల్లి: జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ పునరుద్ధరణకు రూ.26నిధులు మంజూరయ్యాయని ఈ పనులను కార్పొరేటర్ పావని రెండు రోజుల్లో ప్రారంభిస్తారని సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌ను జీహెచ్‌ఎంసీ ఏఈ సలాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, కాంట్రాక్టర్ వీరేందర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. జోనల్ కమిషనర్ పునరుద్ధరణ పనులకు ఎంతో సహకరిస్తున్నారని ఆయన తెలిపారు.

- జవహర్‌నగర్ వ్యాయామశాల ఆటస్థలం, కల్యాణ మండపం పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అధికారులు, నాయకులు పట్టించుకోకపోయినా స్థానిక కార్పొరేటర్ పావని తమ సమస్యలను పట్టించుకుంటున్నారని అన్నారు. కమిషనర్, జోనల్ కమిషనర్ల కార్యాలయాలకు వెళ్లి వారిపై ఒత్తిడి తెచ్చి పునరుద్ధరణ పనులకు నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనికి కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌పీ జిల్లా ఇన్‌చార్జీల నియామకం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బహుజన రాజ్యాధికార పార్టీ (బీఆర్‌పీ)ని గ్రామ గ్రామానికి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయడానికి ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జీలను నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఇన్‌చార్జీల పేర్లను ప్రకటించారు. వరంగల్ జిల్లా ఇన్‌చార్జీగా పూరేల్ల రమేష్, ఖమ్మం జిల్లా బుర్రి సాగర్, కరీంనగర్ జిల్లా రాజేష్, నిజామాబాద్ రవి ముదిరాజ్, అదిలాబాద్ మధుకర్‌నాయక్, మహబూబ్‌నగర్ శ్రీకాంత్, నల్గొండ రమేష్, రంగారెడ్డి రమేష్, మెదక్ పిసరి రజిత, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా తానే వ్యవహరిస్తానని తెలిపారు.

ఆర్‌టీఐ సాధన కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దిలీప్‌రావు

కాచిగూడ: సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.దిలీప్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, జాతీయ ప్రధానకార్యదర్శి మల్లం వెంకటేశం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దిలీప్‌రావు మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచుతానని అన్నారు.

స్థానిక సంస్థల్లో వైశ్యుల వాటా తేల్చాలి



వైశ్యుల రాజకీయ వాటా సాధన దీక్షలో నినాదాలు చేస్తున్న కాచం సత్యనారాయణగుప్తా

కవాడిగూడ: వైశ్యుల ఆత్మ గౌరవం, హక్కుల సాధనకై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యుల రాజకీయ వాటా తేల్చాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణగుప్తా డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు వద్ద వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యుల వాటా సాధన దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు వైశ్యులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. కాచం సత్యనారాయణగుప్తా మాట్లాడుతూ.. వైశ్యులు పేరుకే అగ్రవర్ణాలుగా సమాజంలో కీర్తింపబడుతున్నారని అన్నారు. కానీ రాజకీయంలో అస్పృశులుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు కార్పొరేట్, మార్వాడీ వ్యాపారాల వల్ల పేద వైశ్యుల వ్యాపారాలు నిర్వీర్యం అయిపోతున్నాయని అన్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో వైశ్యుల జనాభా శాతాన్ని అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్‌లో వర్గీకరణతో నిరుపేద వైశ్య విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు.

- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు వైశ్యుల జనాభా దామాషా ప్రకారం 500 సర్పంచులు, 250 ఎంపీటీసీ, 30 ఎంపీపీ, 30 జెడ్పీటీసీ, 200 కౌన్సిలర్లు, 40 కార్పొరేటర్లు, కనీసం ఒక జెడ్పీ చైర్మన్, ఒక మేయర్, 15 మున్సిపల చైర్మన్ స్థానాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజుల్లోనే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ... వైశ్యులకు ఆర్ఎల్‌డీ పార్టీ తరుపున రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైశ్య వికాస వేదిక ట్రస్ట్ సభ్యులు నంగునూరు రమేష్, రామ్ నరేష్, కొత్త రవి, కాచం ఏక్‌సాయి, కోడుమూరు దయాకర్, శేఖర్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

- పరీక్షల నిర్వహణ టీజీపీఎస్సీ వల్ల కాకపోతే యూపీఎస్సీకి ఇవ్వాలి
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి



చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో మాట్లాడుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, నిరుద్యోగులు

చిక్కడపల్లి: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు నేపథ్యంలో చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి వచ్చి నిరుద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రాజకీయాలు చేయడానికి రాలేదని.. లక్షల మంది నిరుద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. గ్రూప్స్ పరీక్షలు నిర్వహించేందుకు టీజీపీఎస్సీ వల్ల కాకపోతే యూపీఎస్సీకి ఇవ్వాలన్నారు. అప్పుడే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రూప్ పరీక్షల్లో ఇలాంటి అవకతవకలు జరుగుతుంటే అభ్యర్థులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అర్హత వయస్సు దాటిపోతుండటంతో వారు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. లోపభూయిష్టంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కోర్టు తీర్పుకు చెప్పే సమాధానం ఏమిటి? అని ప్రశ్నించారు. హడావుడిగా పరీక్షలు నిర్వహించి అవకతవకలకు పాల్పడ్డ ప్రభుత్వ నిర్లక్ష్యానికి విద్యార్థులు, నిరుద్యోగులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జీఓ.29ను తొలగించి న్యాయం చేయాలి..

నిరుద్యోగ అభ్యర్థి శంకర్‌నాయక్ మాట్లాడుతూ... జీఓ.29ను తొలగించి ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భారత్‌గౌడ్, జేఏసీ నేతలు శంకర్‌నాయక్, వెంకటేష్, శ్రీను, ప్రత్యూష, రమేష్, అర్జున్, ఇంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని అడ్డుకోవడానికి యత్నం..

ఓ నిరుద్యోగ వర్గం అభ్యర్థులు మంగళవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డిని అడ్డుకోవడానికి యత్నించారు. ఈ క్రమంలో మరో వర్గం అభ్యర్థులు వారిని వారించారు. దీంతో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి.రాజు నాయక్ జోక్యం చేసుకుని తన సిబ్బందితో వారిని బయటకు పంపించారు.